క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువ మత్యం లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు సోకిన వెంటనే రోగులు డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారంలో భాగంగా తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యరెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్ ఏఈగా జయచంద్రారెడ్డి



తవణంపల్లె: మండల పంచాయతీ రాజ్ శాఖ ఏఈగా జయచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసే ఏఈ గురువారెడ్డి పెనుమూరుకు బదిలీ కాగా, గుడిపాలలో పని చేస్తున్న జయచంద్రారెడ్డిని ఇక్కడికి మండలానికి బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పీఆర్ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ కుమార్

తవణంపల్లె: మండలంలోని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల విధులు, హక్కుల గురించి, పంచాయతీ అభివృద్ధిలో వారి పాత్ర గురించి రిసోర్స్ పర్సన్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, పంచాయతీ కార్యదర్శులు,ఉపసర్పంచ్‌లు,వార్డుసభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం


వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: దోమలను నివారించడం ద్వారానే ప్రాణాంతక వ్యాధులను దూరం చేయవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మంగళవారం మండలంలోని పేయన్నగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల ను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష


గుడిపాల: మాట్లాడుతున్న శివరాజన్

గుడిపాల: పంచాయతీల్లో వార్డు మెంబర్లు కీలకమని ఎంపీడీఓ శివరాజన్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిపాలన విధానంపై వారికి తెలియజేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, జలజీవన్ నిధులు ఎలా వాడాలనేది ? వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మండల మీట్

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళిమోహన్ పాల్గొననున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీటీసీలు, అధికారులు తప్పకు హాజరు కావాలని తెలిపారు.

వర్షాకాలం.. జాగ్రత్తలే రక్ష

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి
- పొలాల్లో విద్యుత్ వైర్లను తాకేటప్పుడు రైతులు జీకేర్‌ఫుల్
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదం తప్పదంటున్న అధికారులు


వర్షం


పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. తడి చేతులతో స్విచ్ వేయడం, తెగిపోయిన కేబుల్ వైరు చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకడం, ఇంట్లో వైర్లపై తడి దుస్తులను ఆరేయడం వంటివి చేస్తే ప్రాణాప్రాయం తప్పదు. ముఖ్యంగా విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

జాగ్రత్తలు మరవద్దు

ఇళ్లు, మిద్దెపై ఆడుకునే పిల్లలు విద్యుత్ వైర్ల వద్దకు వెళ్లకూడదు. గృహాల్లో వాటర్ హీటర్ వాడే సమయంలో స్విచ్ ఆఫ్ చేసి, ప్లగ్ తీసిన తర్వాతే తాకాలి. పొడవైన ఇనుప చువ్వలు, పైపులు తీసుకెళ్లే సమయంలో విద్యుత్ లైన్లకు తగలకుండా చూసుకోవాలి. ఇళ్లలో విద్యుత్ సరఫరా కోసం వినియోగించే వైర్లు జాయింట్లు (అతుకులు) ఉండకుండా చూడాలి. విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను ముట్టుకోకూడదు. ఇళ్లలో కరెంట్ స్విచ్‌లను తడి చేతులతో వేయకూడదు. ఇంటి బయట ఏర్పాటు చేసిన లైట్లు తడవకుండా చూడాలి. చిన్న పిల్లలు కరెంట్ వస్తువులు వద్దకు వెళ్లకుండా చూడాలి. ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై ఆర వేయకూడదు. విద్యుత్ స్తంభాల కింద నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదు. స్తంభం నుంచి గృహాలకు వచ్చే విద్యుత్ సర్వీసు వైరు దెబ్బతింటే వెంటనే సంబంధిత సిబ్బందికి తెలపాలి. ఐఎస్‌ఐ మార్కు కలిగిన విద్యుత్ పరికరాలు వినియోగిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం తగ్గుతుంది. ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి.

వర్షాకాలంలో..

తడిసిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి. వర్షం, ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ వైర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో డిష్ కనెక్షన్లను తీసివేయాలి. వర్షం పడే సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ల స్విచ్‌లను ఆఫ్ చేయాలి. లేకపోతే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు.

పొలాల్లో వద్ద..

రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పొలాల్లోని బోరు, మోటార్ల వద్ద, బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్లను తడి చేతులతో తాకకూడదు. మోటార్ ఆన్ చేసే సమయంలో తప్పనిసరిగా కాళ్లకు చెప్పులు వేసుకోవాలి. విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడవద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయవద్దు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయకూడదు.

చిత్తూరు అర్బన్ డివిజన్‌లో సర్వీసుల వివరాలు

గృహ సర్వీసులు	:	1,54,066
వాణిజ్య సర్వీసులు	:	21,806
వ్యవసాయ సర్వీసులు	:	36,941
పరిశ్రమల సర్వీసులు	:	3,656
వీధి దీపాలు, వాటర్ వర్క్స్ సర్వీసులు	:	5,528
మొత్తం	:	2,21,997

ఇలా చేయాలి..

విద్యుత్ లైన్లు తెగిపోయినా, స్తంభాలు పడిపోయినా, ఇళ్లలో విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు లేదా, సిబ్బందికి లేదా 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. దీంతో విద్యుత్ శాఖ వారు తక్షణమే సరఫరాను నిలిపివేసి ప్రమాద తీవ్రత ఎక్కువ కాకుండా చర్యలు తీసుకుంటారు.

అప్రమత్తంగా ఉన్నాం..



విద్యుత్ సమస్యలపై చిత్తూరు నియోజకవర్గం, పెనుమూరు, పూతలపట్టు, పాలసముద్రం, జీడీ నెల్లూరు మండలాల వారు 9440817419 నంబర్‌కు కాల్‌చేయండి. డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తుపాను తగ్గేవరకు సెలవును రద్దు చేశాం. సరఫరాలో అంతరాయం వచ్చినప్పుడు పునరుద్ధరణ పనులు చేస్తున్నాం. అవసరమైన పరికరాలు నిల్వ ఉంచుకున్నాం. **- మునిచంద్ర, ఈఈ, ట్రాన్స్‌కో**

మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రాజెక్ట్ అధికారి కీర్తి, వైద్య సిబ్బంది

ఐరాల: గర్భిణులకు అందించే కిల్కారి, మొబైల్ అకాడమీ సేవలపై ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని జిల్లా కిల్కారి, మొబైల్ అకాడమీ ప్రాజెక్ట్ అధికారి కీర్తి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమె ఆశావర్కర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు గర్భిణులు, ప్రసవం, పిల్లల సంరక్షణ గురించి కిల్కారి, మొబైల్ అకాడమీ సేవల ద్వారా ఆడియో సందేశాలను వినిపించాలని సూచించారు. గర్భం రెండో త్రైమాసం నుంచి బిడ్డకు ఒక సంవత్సరం వయసు వచ్చే వరకు లేదా గర్భిణీ ఎల్‌ఎంపీ, పిల్లల పుట్టిన తేదీ ఆధారంగా పునరుత్పత్తి చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) పోర్టల్‌లో నమోదు చేసుకున్న మహిళలు, గర్భిణుల మొబైల్ ఫోన్‌లకు నేరుగా ముందుగా రికార్డ్ చేసిన ఆడియో కంటెంట్‌తో వారానికోసారి కాల్ అందుకుంటారని తెలిపారు. గ్రామాల్లో ఈ సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కిల్కారి, మొబైల్ అకాడమీ సేవల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం అందజేత


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు



ఎస్పీకి చెక్కు ఇస్తున్న రిటైర్డు పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితులకు జిల్లా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు సహాయం చేశారు. ఈ మేరకు సంఘ నాయకులు మంగళవారం చెక్కును కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు తమ సంఘం తరఫున రూ. 86,100 చెక్కును అందజేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పేదలను తమ వంతు ఆదుకునేందుకు సేవాభావంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రారెడ్డి, కోశాధికారి హేమాద్రి పాల్గొన్నారు.

రిటైర్డు పోలీసు వితరణ..

చిత్తూరు అర్బన్: విజయవాడ వదరలతో నిరాశ్రయులుగా ఉన్నవారిని ఆదుకోవడానికి జిల్లా రిటైర్డు పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చిత్తూరు నగరంలో ఎస్పీ మణికంఠను రూ.35 వేల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మురళి, ఫెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు


బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వర్షం కారణంగా ప్రజలకు నష్టం జరిగితే వెంటనే 9491077127 నంబరుకు కాల్ చేసి తెలపాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

జనజీవనం అస్తవ్యస్తం..

మండలవ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రమాదంలో ఎంపీపీ అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గిరింపేటలో ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దహనం కేసులో యాదమరి ఎంపీపీ సురేష్‌బాబును టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా చిత్తూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి గిరింపేట వద్ద ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో కొందరు టపాకాయలు పేల్చగా, ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిరి ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు చేసే గోదాములో పడ్డాయి. దీంతో అగ్నిప్రమాదం జరిగి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీనిపై విద్యుత్‌శాఖ డీఈ ఫిర్యాదు ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు సురేష్‌ను అరెస్టుచేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా సమాధి పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని కట్టమంచిలో ఉన్న శ్రీవిశ్వషిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం మహా సమాధి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం బాబా విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కాగడ హారతి, మధ్యాహ్న హారతితో వివిధ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంధులకు అండగా నిలబడాలి

చిత్తూరు అర్బన్: అంధులకు వాహన చోదకులు అండగా నిలబడాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సూచించారు. మంగళవారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ప్రపంచ అంధుల వైట్‌కాన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నిత్యబాబు మాట్లాడుతూ.. అంధులు రోడ్డు దాటేప్పుడు వాహనాలు నడిపేవాళ్లు వేగాన్ని తగ్గించాలన్నారు. వీలైతే కిందకు దిగి వాళ్లను రోడ్డు దాటించే ప్రయత్నం చేయాలన్నారు. దురుసుగా వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జడివానలో జనం ఇక్కట్లు


తవణంపల్లెలో కురుస్తున్న వర్షం

తవణంపల్లె: తుపాను ప్రభావంతో మండలంలోని మంగళవారం ఉదయం నుంచి ఎడ తెరిపి లేని జడివాన కురుస్తోంది. జనం రాకపోకలకు చాలా ఇక్కట్లు పడ్డారు. జడివానకు ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు. గ్రాసం లేక మూగజీవాలు అవస్థలు పడుతున్నాయి. మండలంలో మంగళవారం ఉదయం వరకు 14.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రామీణ రోడ్లు బురదమయంగా మారాయి. చెరువులు, కుంటల్లోకి మాత్రం చుక్కనీరు చేరలేదు. తవణంపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: గ్రామాల్లో సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని, తద్వారా పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ వైస్ సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయవాది హిమబిందు

ఐరాల: చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు న్యాయవాదులు మేరీ, హిమబిందు అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవడం అందరి బాధ్యత అన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత సలహాలు ఇవ్వడంతో పాటు వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా గృహ హింస, మనోవర్తి కేసులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల హక్కులు, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా, దాడులు, ఆస్తి హక్కు తదితర చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, సంఘ మిత్రాలు, మండల సమైక్య లీడర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో మంగళవారం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. నగర శివారులోని బుడమాల చెరువును పరిశీలించి, అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రధానంగా గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు నీరు నిల్వ చేరిన లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. చిన్న, పెద్ద కాలువల్లో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమాచారం అందించాలన్నారు. నీవానది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర సమయాల్లో కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లోని 9849907885 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు తీరని నష్టం


మొగిలిలో పక్వానికి వచ్చిన వరి పైరు

బంగారుపాళెం: వర్షం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంట చేతికందే సమయంలో ఉన్న వరి పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం పంటలు బాగా పండుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి పాలిట వర్షం అడియాశలు నింపుతోంది. గింజల బరువుతో వరికంకులు నేలకొరగడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం వరి పంట వివిధ దశలో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పూత దశలో ఉన్న పంట 10 నుంచి 15 రోజుల్లో గింజలు పాలు పోసుకునే దశకు చేరతాయంటున్నారు. ప్రస్తుతం పూత దశలో భారీ వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారిచేసిన నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. వర్షాల సమయంలో పంట కోత కోయరాదన్నారు. వర్షపు నీరు పొలంలో నిలవకుండా కాలువలు తీసుకోవాలన్నారు. గింజ రంగు మారితే అమ్మకం ధర కూడా తగ్గిపోతుందన్నారు. వరికంకులు నేలపై పడకుండా దుబ్బులుగా కట్టుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టాన్ని నివారించవచ్చు. **- చిట్టిబాబు, వ్యవసాయాధికారి, బంగారుపాళెం**

అభివృద్ధి పనులకు భూమిపూజ


పల్లెపండుగ ర్యాలీ నిర్వహిస్తున్న

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకర పంచాయతీకి చెందిన బాపినాయుడుపల్లెలో మంగళవారం పల్లె పండుగ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాపినాయుడుపల్లెలో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల అంచనాతో 165 మీటర్లు సిమెంటు రోడ్డు నిర్మించడానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, ఏపీఓ లలిత, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం, సదకుప్పం, నలగాంపల్లె, తంబుగానిపల్లె, కల్లూరు పల్లె, కాటప్పగారిపల్లె, గుంతూరు, మొగిలివారి పల్లె, కేయం కండ్రిగ, తుంబపాళెం పంచాయతీల్లో బుధవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళీ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు


గుడిపాల: చిత్తపార గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్


గుడిపాల: రామభద్రాపురంలో..

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో గర్భిణులకు ఇంటి వద్దకే మెరుగైన వైద్యం వస్తోందని పీహెచ్‌సీ వైద్యాధికారులు చంద్రమహేష్, సంధ్య అన్నారు. మంగళవారం మండలంలోని చిత్తపార, రామభద్రాపురం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 110 మంది శిబిరంలో వైద్యసేవలు పొందారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని రోగులకు సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.